క్లుప్తంగా

ఇంటింటికీ మెరుగైన వైద్యసేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే పిల్లలకు బలం



అయ్యగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాసోత్సవంలో సిబ్బంది

చిత్తూరు రూరల్: పౌష్టికాహారమే పిల్లలకు బలమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత అన్నారు. చిత్తూరు మండలం అప్పయ్యగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహార పదార్థాలపై బాలింతలు, గర్భిణులు, పిల్లల తల్లులకు అవగాహన ఆమె కల్పించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని విధిగా అందించాలని కార్యకర్తలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాబర్ట్, అంగన్‌వాడీ కార్యకర్తలు సంగీత, లీలావతి, మిడ్ లెవల్‌హెల్త్ ప్రొవైడర్ సుకన్య, ఏఎన్‌ఎం రేవతి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం



గుడిపాలలో వైద్యపరీక్షలు

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి గడపకు వైద్యం అందజేయనున్నట్లు వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. శనివారం వసంతాపురం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఇందులో భాగంగా ముందుగా సర్పంచ్‌కు వైద్యపరీక్షలు చేశారు. ఇందులో 104 రకాల వైద్యసేవలు అందజేస్తారన్నారు. సెప్టెంబర్ 30న నిర్వహించే మెగా క్యాంప్‌లో సీనియర్ డాక్టర్ల ద్వారా మరోసారి వైద్యపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

ప్రచార రథానికి ఘనస్వాగతం



రథానికి స్వాగతం పలుకుతున్న ఈఓ వెంకటసుబ్బారెడ్డి

తవణంపల్లె: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథానికి అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఈఓ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తవణంపల్లెలోని శ్రీరాముల గుడిలో స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. తర్వాత గోమాతకు పూజలు నిర్వహించి పండ్లు తినిపించారు. అనంతరం అర్చకులు సంప్రదాయపద్ధతులలతో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

డంపింగ్ యార్డుకు దారి పరిశీలన

పూతలపట్టు: పూతలపట్టు మండలం యం.బండపల్లిలో డంపింగ్ యార్డుకు దారిని ఎంపీడీఓ పరిశీలించారు. బండపల్లిలో శ్మశాన స్థలంలోని కొంత భూమిని డంపింగ్ యార్డును నిర్మించనున్నట్లు తెలిపారు. ఆ డంపింగ్ యార్డుకు దారి సమస్య ఉండడంతో శనివారం ఎంపీడీఓ గారి పరిష్కరించారు. వీలైనంత త్వరలో డంపింగ్ యార్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిటిపిరాళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. వీఆర్వో మధు, పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 17న కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివా రం ఉత్తర్వులు జారీ చేసిందని బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానిబాషా తెలిపారు. ఈ మేరకు ఆయ న విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో ఉదయం 10.30 గంటలకు విశ్వకర్మ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మట్టి గణపయ్యనే పూజిద్దాం!

- మట్టి విగ్రహాలే మేలంటున్న పర్యావరణ నిపుణులు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో అనర్థాలు
- ఈనెల 18న వినాయక చవితి
- మండపాల తయారీలో నిర్వాహకులు
- అమ్మకానికి సిద్ధంగా విగ్రహాలు

చిత్తూరు రూరల్: వినాయక చవితి.. అందరికీ సరదా తెచ్చే అత్యంత ఇష్టమైన మొదటి పండుగ. ఎంతదూరంలో ఉన్నా సొంత ఊరిలో జరిగే వినాయకచవితి ఉత్సవాలకు పట్టణాల నుంచి యువకులు తరలిరావడం, మండపాలు ఏర్పాట్లు జరుగుతుంటాయి. చవితి వేడుకల తొలిరోజు మొదలుకొని, నిమజ్జనం వరకు గణేశుని మండపం వద్దే సందడి చేస్తుంటారు. ఈనెల 18న వినాయకచవితి కావడంతో ఊరువాడా అంతా సందడి వాతావరణం నెలకొంది. మండపాల ఏర్పాటు నుంచి విగ్రహాల ప్రతిష్ట వరకు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవాల్లో మట్టి గణపతులనే వినియోగించి, పర్యావరణానికి మేలు చేయాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పల్లెలు, పట్టణాలు, నగరాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మండపాల తయారీ..

ఈనెల 18న జరిగే వినాయక చవితి పండుగ కాగా పట్టణాలకు దీటుగా గ్రామాల్లోని యువకులు ఈ ఏడాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే మండపాల తయారీలో నిమగ్నం కాగా, భారీ విగ్రహాలను కొనుగోలు చేసి, వేడుకగా ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదికేడాది రెట్టింపు ఉత్సాహంతో పెద్దసైజులో పీఓపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత ఈ ఏడాదైనా మట్టి విగ్రహాలను వాడి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా 200 దాకా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా.



వినాయక విగ్రహాల తయారీ



మట్టి ప్రతిమలనే పూజించాలి...

అనాధిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలకు అనుగుణంగా మట్టి ప్రతిమలనే పూజించాలి. అలా కాకుండా మారుతున్న కాలానుగుణంగా ఎన్నో ఆకృతులు, రంగురంగుల వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత వాటికి ఆకర్షితులై మొగ్గుచూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాలకు పోయి, అధికంగా ఖర్చు చేసి మరీ వాటిని కొనుగోలు చేస్తుండడం విచారకరం.

మట్టి విగ్రహాలతో..

సహజ సిద్ధంగా దొరికే బంకమట్టితో రంగులతో తయారైన బొమ్మల ద్వారా నిమజ్జనంతో జలచరాలకు ఎటువంటి హాని కలగదు. మట్టి విగ్రహాలు తయారీ మంచిది. ఇవి సులభంగా కరిగిపోతాయి. మట్టి విగ్రహాల నిమజ్జనంతో తయారైన బొమ్మల ద్వారా జలచరాలకు ఎటువంటి హానికలగదు.

రసాయనాలతో...

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి కరగవు. వీటితో తయారైన ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి.
- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువుల్లో జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.



మట్టిగణపతి

- రసాయనాలు కలిపిన నీటి మూలంగా చర్మవ్యాధులు వస్తాయి. శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. ఇది జీవరాశుల మనుగడపై ప్రభావం చూపుతుంది.
- రసాయన రంగులు కలిపిన నీరు పంటపొలాలకు చేరడంతో దిగుబడులు తగ్గడమే కాకుండా, సహజ సిద్ధంగా పొలాల్లో దొరికే బంకమట్టితో ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

మట్టిబొమ్మలే...



నేను కొన్ని సంవత్సరాలుగా మట్టి బొమ్మలే తయారు చేస్తున్నా. చవితికి ముందు బొమ్మల తయారీని మొదలు పెడతా. మట్టితో చేసి దానికి తానే రంగులు వేస్తా. తన కుటుంబసభ్యులు కూడా తనకు సహకరిస్తున్నారు. చేసినా బొమ్మలన్నీ కూడా ఇంటి వద్దే అమ్ముడుపోతుంటాయి. మట్టి బొమ్మలనే చాలా మంది ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. **–మోహన్‌గిరి, చిత్తూరు**

స్మార్ట్ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం గాంధీ విగ్రహ కూడలి నుంచి షర్మన్ పాఠశాల వరకు చేపడుతున్న స్మార్ట్ రోడ్డు పనులను శనివారం నగర కమిషనర్ జె అరుణ పరిశీలించారు. జరుగుతున్న పనులను పరిశీలించి, రోడ్డు వెడల్పు చేసే పనులకు సంబంధించి ఆక్రమణలను తొలగించాలని ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. స్మార్ట్ రోడ్ నిర్మాణానికి సంబంధించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసీపీ రామకృష్ణుడు, ప్రణాళిక విభాగం అధికారులు ఉన్నారు.

స్వామివారి రథం ట్రయల్ రన్



రథాన్ని ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి రథాన్ని శనివారం సాయంత్రం ఆలయ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఈనెల 25న పురవీధుల్లో ఊరేగనున్న స్వామివారి రథాన్ని ముందస్తుగా ఆలయ అధికారులు 200ల మీటర్లు ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

- కట్టమంచి చెరువులో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు
- ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : వినాయక చవితి ఉత్సవాల్లో నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ రేణుక ఆదేశించారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలు నిర్వహించుకునేలా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. వినాయక విగ్రహాలకు రెవెన్యూ, పోలీసుల అనుమతులను తీసుకోవాలని చెప్పారు. నగర పరిధిలో కట్టమంచి చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 21వ తేదీ వరకు నిమజ్జన సౌకర్యం ఉంటుందన్నారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, నగర పాలక అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్, ఆర్టీసీ డిపో మేనేజర్ రూప, నగర ఉత్సవ కమిటీ సభ్యులు అట్లూరి శ్రీనివాసులు, రామభద్ర పాల్గొన్నారు.

శ్రీవారి మాలధారణతో భక్తుల కాలినడక

- క్రిష్ణగిరి ఊతంగరై నుంచి 250 మంది నడక యాత్ర

పూతలపట్టు: పెరటాసి నెల పురస్కరించుకుని తమిళనాడు క్రిష్ణగిరిలోని వందలాది మంది శ్రీవారి భక్తులు మాలధారణ చేపట్టారు. మొక్కులు చెల్లించడానికి ఏడు కొండలకు నడక మొదలుపెట్టారు. 120 గ్రామాలకు చెందిన 250 మంది భక్తులు క్రిష్ణగిరిలోని ఊతంగరై ప్రాంతంలో బుధవారం బయలుదేరారు. అక్కడి నుంచి ప్రారంభమైన నడక యాత్ర శుక్రవారం మధ్యాహ్నానికి పూతలపట్టులోని శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడ భారీగా వంటవార్పు చేసుకుని సహపంక్తి భోజనం చేశారు. తర్వాత అక్కడి నుంచి స్వామి చెంతకు అడుగులు వేశారు. రెండు రోజుల్లో స్వామి వారిని దర్శించి మొక్కులు చెల్లించుకోనున్నామని వారు వెల్లడించారు.



సహపంక్తి భోజనం చేస్తున్న శ్రీవారి భక్తులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులకు గుర్తింపు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే బాబు, ఆలయ చైర్మన్, ఈఓ



దేవతామూర్తుల వేషధారణల్లో కళాకారులు

కాణిపాకం(యాదమరి): ధర్మప్రచార రథం మాసం పర్యటనలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం కాణిపాక ఆలయ మాడవీధుల్లో, ఆస్థాన మండపంలో కళాకారులు, వివిధ దేవతామూర్తుల అవతారాలతో, చెక్క భజనలతో, కోలాటలు, భరతనాట్యం, కూచిపూడిలతో భక్తులను అలరించాయి. విశేష ప్రతిభ కనబరిచిన వారికి గుర్తింపు సర్టిఫికెట్లను ఆలయ అధికారులు అందిదజేశారు.



నాట్యం చేస్తున్న కళాకారులు

నడకదారి భక్తులకు అన్నదానం

గుడిపాల: పెరటాసి నెల పురస్కరించుకుని తమిళనాడు నుంచి తిరుమలకు వెళ్లే నడకదారి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామానంద ఆశ్రమ భక్తులు శనివారం తెలిపారు. చిత్తూరు–వేలూరు రోడ్డులోని పల్లూరు సమీపంలో ఉన్న రామానంద ఆశ్రమంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాలు జరుగుతుందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో తిరుమలకు పాదయాత్ర భక్తులు, ఇతరులు కూడా పాల్గొనవచ్చన్నారు. 31 రోజుల పాటు ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతుందన్నారు.

పెద్దిశెట్టిపల్లెలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శేషగిరిరావు

గుడిపాల: పెద్దిశెట్టిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ శేషగిరిరావు, వైద్యసిబ్బంది తేజ, ఇందుమతి, నిరోషా, నరసమ్మ, చంద్ర పాల్గొన్నారు.

28న భద్రకాళమ్మ తిరునాళ్లు

గుడిపాల: నరహరిపేట చెక్‌పోస్ట్ ఆవరణలోని భద్రకాళమ్మ దేవాలయంలో ఈనెల 28న 45వ వార్షిక తిరునాళ్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కాళిదాస్ తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా 28న ఉదయం 9గంటలకు నరహరిపేటకు చెందిన రాజేశ్వరి, రజనీకాంత్ దంపతులు యజ్ఞం నిర్వహించనున్నారన్నారు. రాత్రి ఆదిపరాశక్తి సుందరమాల తమిళ వీధినాటకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలి



వివిధ వేషధారణల్లో చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్: సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు పాటించాలని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ వేదవతి అన్నారు. నగరంలోని గిరింపేటలోని నారాయణ పాఠశాలలో శనివారం ముందస్తుగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. వేడుకలలో చిన్నారులు శివుడు, పార్వతి, వినాయకుడు వేషధారణలో విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల ఏజీఎం రవీంద్ర, ఆర్‌ఐ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

చవితి వేడుకలకు మండపాలు సిద్ధం



బంగారుపాళెం: వినాయకచవితి పర్వదినానికి మండలంలో ఏర్పాట్లు ఘనంగా సాగుతున్నాయి. సోమవారం వినాయకచవితి పురష్కరించుకుని మండల కేంద్రంలో వినాయకుని విగ్రహాల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. చిన్న విగ్రహాలు మొదలుకుని పెద్ద విగ్రహాల వరకు ప్రజల అభిరుచులకు తగినట్లుగా వ్యాపారులు విగ్రహాలను అందుబాటులోకి తెచ్చి విక్రయిస్తున్నారు. మండలంలోని 180 గ్రామాల్లో 500 విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. బంగారుపాళెం, తగ్గువారిపల్లె, మొగిలి గ్రామాల్లో ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది భారీ విగ్రహాలను కొలువుదీర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఇందులో ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులకు తెలియజేశారు. వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామని అధికారులు తెలియజేశారు. ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణాలను కూడా వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సర్పంచులు, ఎంపీటీసీలు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. ప్రస్తుతం ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు మంజూరైందని దీంతో సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్ కల్యాణి మాట్లాడుతూ ఇంటి పట్టాలు కావాల్సిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు రజినీకాంత్, జనార్దన్, పెరిల్లా, మోహన్, జయకోడి, గుణవతి, ఎంపీటీసీలు హరిప్రసాద్, మొగిలిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణతోనే మానవ మనుగడ

బంగారుపాళెం: ఓజోన్ పొర సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. టేకుమందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల కారణంగా ఓజోన్ పొర దెబ్బతినిందన్నారు. ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఎంఈఓ–2 రమేష్ మాట్లాడుతూ ఓజోన్ పొరకు హాని కలిగించే క్లోరోఫ్లోరో కార్బన్లను వాతావరణంలో చేరకుండా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణపై పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం అబ్దుల్ సుభాన్, సైన్స్ ఉపాధ్యాయులు షఫీర్‌ఖాన్, విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టేకుమందలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ట్యాబ్‌ల వినియోగంపై మెలకువలు పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్: ట్యాబ్‌ల వినియోగంపై మెలకువలను విద్యార్థులు పాటించాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌లో చిన్న చిన్న సమస్యలున్నట్లైతే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో ప్రత్యేక బృందంతో అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా బైజూస్ నోడల్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ట్యాబ్ అనుకోకుండా పగిలిపోతే తప్పనిసరిగా సంబంధిత సచివాలయంలో ఫిర్యాదు చేసి రసీదు పొందాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.



ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు

సెలవుపై వెళ్లిన చిత్తూరు డీఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి సెలవుపై వెళ్లారు. ఈయన సోదరుడు సతీష్‌కుమార్ తాడిపత్రి థర్మల్ శాఖలో పనిచేస్తూ శనివారం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో డీఎస్పీ నాలుగు రోజులు సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జ్‌గా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.